
సాక్షి
గుంటూరు
శనివారం । 25 । నవంబర్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 524.40 అడుగుల వద్ద ఉంది. ఎడమ కాలువకు 4,034 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ఎన్‌సీసీ డే ర్యాలీ

బాపట్ల అర్బన్ : బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ డే సందర్భంగా క్యాడెట్స్ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఎన్‌సీసీ విశిష్టతను వివరించారు.

వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం



నకరికల్లు: చల్లగుండ్లలో వేంచేసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం విశేష పూజలు చేశారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణం వైభవంగా జరిపించారు.

న్యూస్‌రీల్

మంగళగిరిలో మూడు సోలార్ విద్యుత్ ప్లాంట్లు

రూ.110 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేసిన ఎన్‌రెడ్‌క్యాప్

మంగళగిరి: నగరం సోలార్ సొబగులు అద్దుకోనుంది. ఎన్‌రెడ్‌క్యాప్ సహకారంతో మూడు సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసి నగరపాలక సంస్థకు విద్యుత్ చార్జీల భారం తగ్గించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ.110 కోట్లతో 17 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి లక్ష్యంగా అధికారులు డీపీఆర్ సిద్ధం చేశారు. సోలార్ ప్లాంట్లు అందుబాటులోకి వస్తే నగరపాలక సంస్థకు నెలకు సుమారు రూ.40 లక్షల మేర విద్యుత్ చార్జీల భారం తగ్గనున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఎన్‌రెడ్‌క్యాప్ పీడీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఎంటీఎంసీ పరిధిలో సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు కోసం రూ.110 కోట్లతో డీపీఆర్ సిద్ధం చేశామని, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచనలతో నగరంలోని ఆత్మకూరు, కాజ, స్విమ్మింగ్‌పూల్ ప్రాంతాలను పరిశీలించి సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.

యార్డులో 21,962 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 21,542 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 21,962 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.23,100 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.15,000 నుంచి రూ.21,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి రూ.24,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 10,305 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

రేపు తెనాలిలో ఆంధ్రప్రదేశ్ టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక

తెనాలి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీ–20 క్రికెట్ జట్టు ఎంపిక ఈనెల 26న స్థానిక రామలింగేశ్వరపేటలోని యువ క్రికెట్ అకాడమీలో జరగనుంది. ఎంపికైన రాష్ట్ర జట్టు గోవాలో వచ్చేనెల 8–12 తేదీల్లో జరగనున్న టీ–20 క్రికెట్ నేషనల్ క్యాష్ ప్రైజ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటుందని ఏపీ యూత్ టీ–20 క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.భాస్కర్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎంపికలో పాల్గొనే క్రీడాకారులు వైట్ అండ్ వైట్ డ్రెస్, షూస్, క్రికెట్ కిట్‌తో సహా ఆరోజు ఉదయం 8 గంటలకు హాజరుకావాలని కోరారు. సెలక్షన్ కమిటీ సభ్యులు ఎన్‌వీ కిశోర్‌చౌదరి, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, ఎస్.అచ్యుత కుమార్, ఎ.నరేంద్ర జట్టు ఎంపికను నిర్వహిస్తారు. ఇతర వివరాలకు 7989215572, 9703568884 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఓట్ల చేర్పులు, తొలగింపులపై చర్యలు తీసుకోవాలి

బాపట్ల కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల: ఓట్ల చేర్పులు, తొలగింపులు, సవరణలపై చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కలెక్టర్ల సమావేశాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం నిర్వహించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపుల కోసం వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు గుర్తింపు కార్డుల జనరేషన్‌ను పరిశీలించాలన్నారు. ఓటర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.హెచ్.శ్రీధర్, డీఆర్వో పి.వెంకట రమణ పాల్గొన్నారు.

చుండూరు తహసీల్దార్ సస్పెన్షన్

చుండూరు(వేమూరు): చుండూరు తహసీల్దార్ సురేష్‌బాబును సస్పెండ్ చేస్తూ బాపట్ల జిల్లా కలెక్టర్ షేక్ రంజిత్ బాషా ఆదేశాలు జారీ చేశారు. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు మండలం తహసీల్దారుగా పని చేస్తున్న సురేష్ బాబు ఎన్నికల బదిలీపై గత నెల 27న బాధ్యతలు చేపట్టారు. మార్టూరు మండల తహసీల్దారుగా పని చేస్తున్నప్పుడు ఎన్నికలకు సంబంధించిన ఫారం–6, ఫారం–7, ఫారం–8 సమాచారం వాట్సాప్ ద్వారా ఇతర పార్టీ నాయకులకు పంపించారు. ఈ సమాచారం తెలుసుకున్న పార్టీ నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జరిపిన విచారణలో నిబంధనల ఉల్లంఘన నిర్ధారణ కావడంతో తహసీల్దారు సురేష్‌బాబును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్టు డెప్యూటీ తహసీల్దారు దుర్గ తెలిపారు.

సంక్షేమ సంకల్పం

- దేశ సమగ్రాభివృద్ధికి సమష్టి కృషి
- రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపు
- గుంటూరులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభం



వికసించే భారతం : సంక్షేమ పథకాల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే సుచరిత, జెడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టినా, మేయర్ మనోహర్, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే మద్దాళి గిరి, డీసీసీబీ చైర్మన్ లాలుపురం రాము, జేసీ రాజకుమారి తదితరులు

గుంటూరు రూరల్: దేశ సమగ్రాభివృద్ధికి సమష్టిగా అందరం కృషి చేద్దామని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. రూరల్ మండలం లాలుపురం గ్రామంలోని ఏఎస్‌ఆర్ కన్వెన్షన్‌లో శుక్రవారం 'వికసిత్ భారత్–సంకల్ప యాత్ర ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. గవర్నర్‌కు జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పుష్పగుచ్ఛాలను అందించి సాదరస్వాగతం పలికారు. ముందుగా కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఆయుష్మాన్ భారత్, జలజీవన్ మిషన్, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎం ఉజ్వల్ కానుక, పోషణ్ అభియాన్, దీన్‌దయాళ్ అంత్యోదయ, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, జన్‌ధన్ యోజన, నానో ఎరువులు, జీవన్ జ్యోతి బీమా, ఏకలవ్య ఆదర్శ పాఠశాలలు, అటల్ పెన్షన్ తదితర పథకాల స్టాళ్లను గవర్నర్ సందర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ సందేశంతోపాటు ఏపీ అభివృద్ధిపై ప్రదర్శించిన లఘు చిత్రాన్ని గవర్నర్ ప్రజాప్రతినిధులతో కలిసి తిలకించారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రతిజ్ఞ చేశారు. మన సంకల్ప్, వికసిత్ భారత్ పుస్తకాలు, క్యాలెండర్లను గవర్నర్ ఆవిష్కరించారు.



విశిష్ట వ్యక్తులకు అవార్డులు

అనంతరం సమావేశంలో గవర్నర్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ ప్రచార కార్యక్రమంలో అధికారులందరూ భాగస్వాములు కావాలన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు తమ మనోగతాన్ని ఆవిష్కరించారు. పలు రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి గవర్నర్ ప్రత్యేక అవార్డులు అందజేశారు.

రోజూ రెండు గ్రామాల్లో..

ఏపీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్ మాట్లాడుతూ ప్రతి రోజూ రెండు గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వాహనాలు యాత్ర సాగిస్తాయని వెల్లడించారు. పథకాల లబ్ధి అర్హులందరికీ అందాలన్నదే ముఖ్య ఉద్దేశమన్నారు. అర్హత ఉన్న వారందరూ పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. స్టేట్ నోడల్ ఆఫీసర్ పీయూష్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించటం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమన్నారు. జనవరి 26వ తేదీ వరకూ ఈ యజ్ఞం సాగుతోందని చెప్పారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌తోపాటు 250 గ్రామాల్లో 60 రోజులపాటు కొనసాగుతోందని వివరించారు.



జయహో భారత్: డ్రోన్‌పై జాతీయ పతాక రెపరెపలను తిలకిస్తున్న గవర్నర్ నజీర్ తదితరులు

పీఎం, సీఎం విశేష కృషి

రాజ్యసభ సభ్యులు అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 31 లక్షల మంది ఇళ్ల స్థలాలు పొందారని, మరో 15 లక్షల మందికి ఇళ్ల నిర్మాణం చేపట్టామని వివరించారు. జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మాట్లాడుతూ సమాజాభివృద్ధికి, పేదల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి, సర్పంచ్‌లు ఆరుదల సాంబశివరావు, ముబ్బు శిరీష గవర్నర్‌కు శాలువాలు కప్పి సన్మానించారు. ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి రామాంజనేయులు (లాలుపురం రాము), జేసీ రాజకుమారి, ఆర్డీఓ శ్రీకర్, తహసీల్దారు సాంబశివరావు, ఎంపీడీఓ ఆదినారాయణ, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో మేలు



వ్యవసాయంలో దిగుబడులు తగ్గి నష్టాలు రావడంతో రైతు భరోసా కేంద్రాల ద్వారా పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో భూసార పరీక్షలు చేయించాను. నత్రజని ప్రభావం ఉందని చెప్పారు. తగిన యాజమాన్య పద్ధతులు పాటించాను. దిగుబడులు పెరిగాయి.

– వణుకూరి వెంకటశివారెడ్డి, అంకిరెడ్డిపాలెం గ్రామం

పోషణ్ అభియాన్‌తో పుష్టిగా..



స్వల్ప అనారోగ్య కారణాలతో ఎప్పుడూ నీరసంగా ఉండేదాన్ని. పోషణ్ అభియాన్ కార్యక్రమం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పౌష్టికాహారం తీసుకున్నాను. అనారోగ్య కారణాలు తొలగిపోయి ఇప్పుడు ఆరోగ్యంగా, పుష్టిగా ఉన్నాను. ప్రభుత్వాలకు ధన్యవాదాలు.

– కీర్తి, గుంటూరు

ఆయుష్మాన్ భవ, ఆరోగ్యశ్రీ వరం



కూలీనాలీ చేసుకుని జీవిస్తుంటా. గత ఏడాది అనారోగ్యంతో ఆస్పత్రికి వెళ్తే కాలేయం పాడైందని చెప్పారు. ఆయుష్మాన్ భవ, ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేశారు. మందులు ఇచ్చి తిరిగి ఇంటికి వచ్చేప్పుడు ఖర్చులకు డబ్బు ఇచ్చారు. ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాను.

– జోజి, చల్లావారిపాలెం గ్రామం

ఉపాధి పొందాను



కంప్యూటర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. దీన్ దయాళ్ ఉపాధి యోజన ద్వారా కంప్యూటర్ నైపుణ్యాలు నేర్చుకున్నాను. నేడు ఉపాధిని పొంది సంతోషంగా జీవిస్తున్నాను.

– ఆకాంక్ష, గుంటూరు

అరాచకాల సంగం

- ధూళిపాళ్ల అడ్డాగా మారిన వైనం
- కమీషన్ తగ్గించారంటూ అడగడానికి వచ్చిన రైతులపై దాడి
- వచ్చింది తెలుగుదేశం వారే అయినా పాశవికం
- ధూళిపాళ్లతో సహా 15 మందిపై కేసు
- సీసీ టీవీ ఫుటేజ్ కోసం వచ్చిన పోలీసులపైకి డెయిరీ సిబ్బందిని ఉసిగొలిపిన ధూళిపాళ్ల
- గేట్లు వేసి సిబ్బందితో భైఠాయింపు
- గతంలో కూడా ఇదే తీరు



చేబ్రోలు మండలం వడ్లమూడిలోని సంగం డెయిరీ ముఖద్వారం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: పాడిరైతుల కష్టంతో పెరిగిన సంగం డెయిరీ.. మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అరాచకాలకు అడ్డాగా మారిపోయింది. డెయిరీకి పాలు అందించిన పాడి రైతులను మోసం చేయడమే కాకుండా ప్రశ్నించేవారిపై దాడులకు తెగబడే దుస్థితికి దిగజారింది. ఆఖరికి దాడులకు సంబంధించిన ఫిర్యాదుపై దర్యాప్తు చేయడానికి వచ్చిన పోలీసు అధికారులను కనీసం డెయిరీ ఆవరణలోకి రాకుండా అడ్డుకోవడం చూస్తుంటే ధూళిపాళ్ల సంగం డెయిరీని తన సొంత కార్యకలాపాలకు ఎలా వాడుకుంటున్నారో అర్థమవుతోంది.

అసలేం జరిగిందంటే..

ఈనెల 15న ఏలూరు జిల్లా లింగపాలెం మండలం రంగాపురం, వేములపల్లి గ్రామాలకు చెందిన పాడి రైతులు తమకు కమీషన్ తగ్గిందని, ఇది అన్యాయమని ప్రశ్నించడానికి చేబ్రోలు మండలంలోని సంగం డెయిరీకి వచ్చారు. ధూళిపాళ్ల మనుషులు వారిపై పాశవికంగా దాడి చేశారు. ఈ దాడిలో 15 మందికి గాయాలైన సంగతి తెలిసిందే. దీనిపై ధూళిపాళ్లతో సహా 15 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం విచారణకు డెయిరీకి వెళ్లడంతో వారిపై దౌర్జన్యానికి ధూళిపాళ్ల సిబ్బందిని రెచ్చగొట్టారు. టీడీపీ కార్యకర్తలను సమీకరించి గొడవకు దిగారు.

మొదటి నుంచి ఇంతే..

సంగం డెయిరీని దొడ్డిదారిన దక్కించుకున్నప్పటి నుంచి ధూళిపాళ్ల వ్యవహార శైలి ఇలానే ఉందని అధికారులు చెబుతున్నారు. గతంలో సీఐడీ అధికారులు విచారణకు వచ్చిన సమయంలోనూ ఇలాగే రచ్చ చేశారు. రైతులతో ఒప్పందం చేసుకునే సమయంలో 14 శాతం బోనస్ ఇస్తామని చెప్పి చివరికి వారికి నాలుగు శాతంతో సరిపెడుతున్నారు. అదేమని ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు తెగబడుతున్నారు. డెయిరీ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం లిమిటెడ్‌లో సభ్యులకు ఇష్టం లేకపోయినా ఉత్పత్తిదారులకు ఇచ్చే బోనస్ మొత్తం నుంచి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి ట్రస్ట్‌కు సొమ్మును బదిలీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రెండేళ్ల క్రితం 100కు 21.25 రూపాయలు బోనస్‌గా ప్రకటించినా అందులోనూ సుమారు 30 శాతం సొమ్మును ట్రస్ట్‌కు బదిలీ చేశారు. బోనస్ సొమ్ము పాల ఉత్పత్తిదారులకు ఇవ్వకముందే పాలకేంద్రం సెక్రటరీ ద్వారా సభ్యులందరూ ఇష్టపూర్వకంగా విరాళం ఇస్తున్నట్లు సంఘంలో తీర్మానం చేయిస్తారు. సంఘ ప్రెసిడెంట్‌చే ఖాళీ చెక్కుపై సంతకం తీసుకుని దగ్గర పెట్టుకుంటారు. విరాళం సొమ్ము మినహాయించి బోనస్ పంపిణీ చేస్తారు. విరాళం సంఘం ఖాతాలో జమచేసి వెంటనే తీసుకున్న ఖాళీ చెక్కును పూరించి సొమ్ము డ్రా చేసి ట్రస్ట్‌కు బదలాయిస్తారు. ఇది కొంతకాలంగా సంగం డెయిరీలో జరుగుతున్న తంతు.

కంపెనీ చట్టంలోకి మార్చి

రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఏర్పడిన సహకార రంగంలోని సంగం డెయిరీని కంపెనీ యాక్ట్‌లోకి ధూళిపాళ్ల మార్చేశారు. 1977లో స్థాపించిన గుంటూరు జిల్లా పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (సంగం డెయిరీ) మొదట్లో 1964 సహకార చట్టంలో పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో కొనసాగింది. తరువాత ఎన్‌టీఆర్ హయాంలో 1995లో మ్యాక్స్ చట్టంలోకి వచ్చిన తరువాత కొంతమేర ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించారు. దీని ద్వారా పరస్పర సహాయ సహకార(మ్యాక్స్)చట్టం ద్వారా కొనసాగింది. దీని ద్వారా గుత్తాధిపత్యం పాలకవర్గం అజమాయిషీలో ఉండేది. ప్రస్తుత సంగం డెయిరీ చైర్మన్ నరేంద్ర తన స్వప్రయోజనాల కోసం దీనిని కంపెనీ చట్టంలోకి మార్చారు. దీని ద్వారా పూర్తి అధికారాలు చైర్మన్‌కు మాత్రమే ఉంటాయి. దీంతో ప్రస్తుతం సంగం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌గా మారిపోయింది.

పాల ఉత్పత్తిదారుల పెట్టుబడితో నరేంద్ర ఇష్టారాజ్యం

జిల్లాలోని పాల ఉత్పత్తిదారుల పెట్టుబడిని తన సొంత పెట్టుబడిగా మార్చుకొని సంగం డెయిరీ చైర్మన్ నరేంద్రకుమార్ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండటంతో డెయిరీ మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. జిల్లాలో మొదట్లో డెయిరీకి 600 పాల సొసైటీలు ఉన్నాయి. అవి క్రమేణా తగ్గిపోయి 370 మిల్క్ సొసైటీలకు పరిమితమయ్యాయి. ఏలూరు ప్రాంతానికి చెందిన ద్వారకామయి డెయిరీ పాయింట్ సంగం డెయిరీతో ఒప్పందం చేసుకున్నా వారికి చెల్లించాల్సిన రూ.50 లక్షలు చెల్లించకపోవడంతో ప్రశ్నించడానికి వచ్చిన రైతులపై దాడి చేయడంతో 15 మందికి తీవ్ర గాయాలు కాగా, మూడు కార్లు ధ్వంసమయ్యాయి. రూ.ఐదు లక్షల మేర నష్టం జరిగింది. దాడికి గురైన వారందరూ దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరులే కావడం విశేషం. తన స్వార్థం కోసం సొంతపార్టీ వారిపై దాడులకు దిగడమే కాకుండా కేసు విచారణ విషయంలో పోలీసులకూ సహకరించకపోగా వారిపై దౌర్జన్యానికి సిబ్బందిని పురిగొల్పడం చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై పోలీసులు సీరియస్‌గా ఉన్నారు. ఈ కేసులో నిందితులుగా ఉన్నవారికి హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

సంక్షేమ గళం



ఇంటి కల నెరవేరింది



ఎన్నోఏళ్లుగా ఎదురు చూస్తున్న సొంతింటి కల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల తీరింది. కూలి పనిచేసుకుంటూ జీవితాన్ని నెట్టుకొచ్చే మాలాంటి వారికి ఇంటి స్థలం సమకూర్చుకోవడం గగనమే. అలాంటి మాకు సీఎం జగన్ స్థలాన్ని కేటాయించడం చాలా సంతోషంగా ఉంది. అంతేకాదు అందులో ఇల్లు కట్టుకునేందుకు ఆర్థిక సాయాన్ని అందజేయడం ఇంకా ఆనందంగా ఉంది. మా కోసం ఇన్ని చేస్తున్న జగన్‌బాబును మళ్లీ గెలిపించుకుంటాం.

–ఇ.యోగమ్మ, పతుల కాలనీ, మేదరమెట్ల, బాపట్ల జిల్లా

విద్యా పథకాలు ఆసరాగా ఉన్నాయి



నా భర్త ఏడేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. నాకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కూలి పనులకు వెళ్లి పిల్లలను పోషించుకుంటున్నా. భర్త చనిపోతే పిల్లలను చదివించుకోవటం కష్టమనుకున్నాను. అలాంటి తరుణంలో సీఎం జగనన్న అమలు చేస్తున్న అమ్మఒడి పథకం పిల్లల చదువుకు ఆసరాగా నిలిచింది. విద్యాకానుక, అమ్మఒడి సొమ్ము మాలాంటి ఒంటరి మహిళల పిల్లలకు అండగా ఉంటుంది. జీవితాంతం సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– నల్లబోతుల లక్ష్మి, యద్దనపూడి మండలం, పూనూరు, బాపట్ల జిల్లా

చిన్నారుల అదృశ్యం.. ఆచూకీ లభ్యం

తెనాలిరూరల్/తెనాలిఅర్బన్: ఇంటి వద్ద ఆడుకుంటూ నలుగురు చిన్నారులు అదృశ్యమయ్యారు. కొద్ది సేపటికి గుర్తించిన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన పోలీసులు కొద్ది గంటల వ్యవధిలోనే చిన్నారుల ఆచూకీ గుర్తించడంతో కథ సుఖాంతమైంది. పోలీసుల కథనం ప్రకారం.. చినరావూరుతోట నుంచి పోతురాజు కాలనీకి వెళ్లే రోడ్డుకు చెందిన అక్కాతమ్ముళ్లు రాధిక(13), రాఘవేంద్ర (8), అదే రోడ్డులో నివసించే అల్తాఫ్ (9), ఆరిఫ్ (7) శుక్రవారం ఉదయం ఇంటి పరిసరాల్లో ఆడుకుంటూ ఉన్నట్టుండి అదృశ్యమయ్యారు. దీంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు.

తక్షణమే ప్రత్యేక బృందాల ఏర్పాటు..

తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు వెంటనే డీఎస్పీ బి.జనార్దనరావు నేతృత్వంలో వన్‌టౌన్, టూటౌన్, త్రీ టౌన్ సీఐలు కె.చంద్రశేఖర్, ఎస్.వెంకట్రావు, ఎస్.రమేష్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా పిల్లలు విజయవాడ వెళ్లి ఉంటారన్న అనుమానంతో దర్యాప్తు ప్రారంభించారు. నలుగురు చిన్నారులు చినరావూరు రైల్వే స్టేషన్‌కు వెళ్లి అక్కడి నుంచి తెనాలి జంక్షన్‌కు రేపల్లె ప్యాసింజరులో వెళ్లి అక్కడ మరో రైలెక్కి విజయవాడ చేరుకున్నారని పోలీసులు గుర్తించారు. వెంటనే అప్రమత్తమై రెండు బృందాలు విజయవాడకు చేరుకుని రైల్వే స్టేషన్ పరిసరాల్లో గాలింపు చేపట్టాయి. నలుగురు చిన్నారులు విజయవాడ రాఘవయ్య పార్కులో ఉన్నట్టు పోలీసులు తెలుసుకున్నారు. పార్కుకు వెళ్లగా ఆరిఫ్ మినహా మిగిలిన ముగ్గురూ కనబడ్డారు. వెంటనే వారిని తెనాలి తీసుకువచ్చారు. ఆరిఫ్ తప్పిపోయి పార్కు వద్ద ఏడుస్తుండగా గమనించిన తాడేపల్లికి చెందిన ఆటోడ్రైవర్ మహమ్మద్ ఖాసిం బాలుడితో మాట్లాడాడు. బాలుడు తనది తెనాలి అని చెప్పడంతో ఆటోలో తెనాలి తీసుకువచ్చి పోలీసులకు అప్పగించాడు. దీంతో అదృశ్యమైన చిన్నారుల కథ సుఖాంతమైంది. ఈ మేరకు తన కార్యాలయంలో రాత్రి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ జనార్దనరావు వివరాలు వెల్లడించారు. రాధిక విజయవాడలో పార్కును చూపిస్తానని చెప్పి మిగిలిన చిన్నారులను తీసుకెళ్లిందని పోలీసులు తెలిపారు. పార్కులో ఆరిఫ్ తప్పిపోవడంతో రాధిక అక్కడి మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేయించిందని, దీనివల్ల పోలీసులకు కచ్చితమైన సమాచారం అందిందని తెలిసింది.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు (సర్కిల్‌లో) చిన్నారులు

క్లుప్తంగా

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల సంఖ్య పెంచాలి



చీరాల అర్బన్: ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల సంఖ్య పెంచాలని ఓపెన్ స్కూల్స్ రాష్ట్ర సమన్వయకర్త ఎం.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెం జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని ఓపెన్ స్కూల్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఓపెన్ స్కూల్‌లో చేరే వారి సంఖ్యను గణనీయంగా పెంచాలన్నారు. అనంతరం డీఈఓ, పీవీజే రామారావు, జిల్లా సమన్వయకర్తల సందేశాలను వివరించారు. ఓపెన్ స్కూల్‌లో చేరే మంచి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సిబ్బంది సైకం శ్రీనివాస్, నాగయ్య పాల్గొన్నారు.

పల్నాడు జిల్లాలో 25 మండలాల్లో వర్షం

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో 25 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణ అధికారులు వెల్లడించారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం వరకు జిల్లా వ్యాప్తంగా 173.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా ముప్పాళ్ల మండలంలో 24.2 మిల్లీమీటర్ల వర్షం పడగా అత్యల్పంగా పెదకూరపాడు, వెల్దుర్తి మండలాల్లో 1.2 మి.మీ వర్షం పడింది. మొత్తం 28 మండలాలు ఉండగా వాటిలో మాచర్ల 4.6, దుర్గి 8.6, రెంటచింతల 13.6, గురజాల 1.4, దాచేపల్లి 3.8, పిడుగురాళ్ల 8.6, బెల్లంకొండ 7.6, అచ్చంపేట 6.6, క్రోసూరు 4.8, సత్తెనపల్లి 5.0, రాజుపాలెం 7.2, నకరికల్లు 2.6, బొల్లాపల్లి 5.4, వినుకొండ 4.2, నూజెండ్ల 1.6, శావల్యాపురం 1.8, ఈపూరు 10.2, రొంపిచర్ల 1.4, నరసరావుపేట 4.6, నాదెండ్ల 15.4, యడ్లపాడు 4.2 మి.మీ వర్షం కురిసింది.

నిరుద్యోగులను పోటీ పరీక్షలకు తీర్చిదిద్దడమే లక్ష్యం

కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఫౌండర్ ఈవీ నారాయణ

పెదకాకాని: నిరుద్యోగుల్ని పోటీ పరీక్షలకు సిద్ధం చేయడమే కౌండిన్య ఐఏఎస్ అకాడమీ లక్ష్యమని ఫౌండర్, చైర్మన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఈవి నారాయణ తెలిపారు. మండలంలోని వెనిగండ్ల గ్రామ శివారు జొన్నలగడ్డ రోడ్డులో గౌడ జన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్మించిన కౌండిన్య ఐఏఎస్ అకాడమీలో ఈనెల 27న ఉదయం 10 గంటల నుంచి గ్రూపు- 2 పరీక్షలకు తరగతులు ప్రారంభం పురస్కరించుకుని శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈవీ నారాయణ మాట్లాడుతూ కానిస్టేబుల్ నుంచి కలెక్టర్ ఉద్యోగాల వరకూ పోటీ పరీక్షలకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇవ్వాలనే ఆశయంతో కౌండిన్య ఐఏఎస్ అకాడమీని స్థాపించినట్లు చెప్పారు.

లాభాపేక్ష లేకుండా నామమాత్రపు ఫీజుతో కులమతాలకు అతీతంగా నిరుద్యోగులకు, చిరుద్యోగులకు శిక్షణ ఇప్పించాలనే సంకల్పంతో, సమాజ శ్రేయస్సు కోసం అభిలషించే దాతల సహాయంతో అకాడమీ నిర్మాణ, నిర్వహణ చేపటినట్లు వివరించారు. ప్రతి రాష్ట్రంలోనూ ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ శిష్య బృందాన్ని సంపాదించుకున్న వై. సత్యనారాయణ పర్యవేక్షణలో అపార అనుభవం ఉన్న వారు ఫ్యాకల్టీగా నియమితులయ్యారని తెలిపారు. కౌండిన్య ఎడ్యుకేషనల్ సొసైటీ పేరుతో 18 ఏళ్ల కిందట రూ. 10 వేలతో ముగ్గురు విద్యార్థులకు ప్రారంభించిన ప్రతిభా స్కాలర్‌షిప్‌లు ప్రస్తుతం 6 వేల మందికి పైగా రూ. 1.75 కోట్లను అందిస్తున్నట్లు వెల్లడించారు.

ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఈవీ నారాయణ కోరారు. సమావేశంలో అకాడమీ ప్రతినిధులు పామర్తి సాంబశివరావు, బెల్లంకొండ సదాశివరావు, బొబ్బిళ్ల వెంకటేశ్వరరావు, వాకా రాంగోపాల్‌గౌడ్, జల్లెడ శ్రీనివాసరావు, వీరంకి రంగారావు, పాండి శివన్నారాయణ పాల్గొన్నారు.



అకాడమీలో మాట్లాడుతున్న ఈవీ నారాయణ

చోరీ బైక్‌పై తిరుగుతూ... దొంగతనాలు చేస్తూ...

పోలీసులకు పట్టుబడిన పల్నాడు జిల్లావాసి

తెనాలి: అతడో దొంగ...చేసేది సాదాసీదా నేరాలే అయినా దర్జాగా ఉండాలనుకుంటాడు. పగలు ద్విచక్ర వాహనంపై తిరుగుతూ, రాత్రివేళల్లో దొంగతనాలు చేస్తుంటాడు. అవికూడా దేవుడి గుడిలోనే సుమా! ఎప్పుడో ఒకరోజు దొంగ దొరికిపోతాడు అన్నట్టుగా చివరికి పోలీసుల చేతికి చిక్కాడు. ఆ వివరాలను శుక్రవారం స్థానిక టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ ఎస్. వెంకట్రావు విలేకరుల సమావేశంలో తెలియజేశారు. ఈనెల 22వ తేదీ రాత్రి రజకచెరువు దగ్గర్లోని శ్రీసీతారామ కల్యాణ దేవస్థానంలోకి ప్రవేశించాడు. ఆలయంలోని హుండీని పగులగొట్టి, అందులోని సుమారు రూ.2 వేలను చోరీ చేశాడు. అందిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదుచేసి పోలీసులు దర్యాప్తునకు దిగారు. విచారణలో నిందితుడు పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన తమ్మిశెట్టి గోపీగా గుర్తించారు.



నిందితుడితో టూ టౌన్ సీఐ వెంకట్రావు

ఇతడిపై ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో వివిధ కేసులు ఉన్నట్టు సీఐ వెంకట్రావు చెప్పారు. స్థానిక మారీసుపేట ఎరువులకొట్ల బజారులో పార్క్ చేసిన బైక్‌ను ఈనెల 18న కూడా గోపి అపహరించాడు. అదే బండిపై తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నట్టు సీఐ వివరించారు. స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలో బైక్‌పై తిరుగుతున్న గోపీని గుర్తించిన పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. అతడి వద్దనున్న రూ.520 నగదుతో పాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

జీజీహెచ్‌ను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తులు

గుంటూరు మెడికల్: రాష్ట్రంలోని జిల్లా న్యాయమూర్తుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 30 మంది ఏపీ లోని వివిధ జిల్లాల న్యాయమూర్తులు ప్రభుత్వ ఆసుపత్రి లోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఉన్నత న్యాయస్థానం హైకోర్టు ఆదేశాల మేరకు ఏపీ జ్యూడీషియల్ అకాడమీ డైరెక్టర్ హరిహరనాథ శర్మ, సీనియర్ ఫ్యాకల్టీ డాక్టర్ వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి లోని వివిధ వార్డులను న్యాయవాదుల బృందం పరిశీలించింది. ముందుగా గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను బృందం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బృందం క్యాజువాల్టీ, ఆర్థోపెడిక్, రక్త పరీక్ష కేంద్రంతో పాటు వివిధ వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల గురించి ఆరా తీసి వారితో నేరుగా మాట్లాడారు.



జిల్లా న్యాయమూర్తుల బృందంతో డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, డాక్టర్ రమణ యశస్వి తదితరులు

రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి, మెడికల్ లీగల్ కేసులకు సంబంధించి, శవ పంచనామా వివరాలు, పోస్టుమార్టం విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పలు జిల్లాల న్యాయమూర్తులు ఎస్.చినబాబు, పాండు రంగారెడ్డి, రామచంద్రుడు, దీనబాబు, శైలజ, ఆనంది, గాయత్రీ, బిందు మాధవి, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి టి కె రెడ్డి, ఎముకలు కీళ్లవిభాగం హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్.ఎస్.వి రమణ, డాక్టర్ రాధిక, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

అంతర కళాశాలల మహిళా వాలీబాల్ పోటీలు ప్రారంభం



తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళా వాలీబాల్ పోటీలు శుక్రవారం స్థానిక జేఎంజే మహిళా కాలేజీలో ఆరంభమయ్యాయి. రెండు రోజులు జరిగే ఈ పోటీల్ని యూనివర్సిటీ ఎడ్యుకేషన్ డీన్ అండ్ డైరెక్టర్ ప్రొఫెసర్ జాన్సన్ ప్రారంభించారు. క్రీడలతో కలిగే ప్రయోజనాల్ని ఆయన వివరించారు. ప్రతిభ చూపినవారికి క్రీడా కోటాలో ఉద్యోగ అవకాశాలు కూడా ఉంటాయని చెప్పా రు. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనాలని సూచించారు. యూని వర్సిటీ పరిశీలకుడు డాక్టర్ ధనుంజయరావు, కాలేజీ కరస్పాండెంట్ థెరెసమ్మ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మేరీ శారద, సిస్టర్ అముల్ మేరి పాల్గొన్నారు. ఈ పోటీల్లో గుంటూరు, ఒంగో లు, చౌడవరం, గోరంట్ల, జేఎంజే మహిళా కాలేజీ, ముప్పాళ్ల, యూనివర్సిటీ కాలేజీల మహిళా జట్లు పాల్గొంటున్నాయని జేఎంజే వ్యాయామ అధ్యాపకురాలు కె.అరుణ సుజాత తెలిపారు. శ్రావ్య, మేఘన స్వాగతం పలికారు.

టిఫిన్‌కని వచ్చి.. మెడలో గొలుసు లాక్కెళ్లి..

రావూరిపేటలో చైన్ స్నాచింగ్

వేటపాలెం: ఒంటరిగా హోటల్‌లో ఉన్న మహిళ మెడలో బంగారు గొలుసును దుండగులు లాక్కొని పరారయ్యారు. ఈఘటన మండల పరిధిలోని రావూరిపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ జి.సురేష్ తెలిపిన వివరాల మేరకు.. రావూరిపేట ప్రధాన రహదారి పక్కన నాగరత్నావళి అనే మహిళ చిన్న టిఫిన్ సెంటర్ పెట్టుకొని జీవనం సాగిస్తోంది. రోజు మాదిరిగా పనిలో ఉండగా టిఫిన్ తినేందుకు ఇద్దరు యువకులు అక్కడకు వచ్చారు. తిన్నాక డబ్బులు ఇచ్చే వంకతో మాటామాటా కలిపారు. ఈక్రమంలో పనిచేసుకుంటున్న నాగరత్నావళి మహిళ మెడలో నాలుగు సవర్ల బంగారు చైన్‌ని లాక్కొని ఉడాయించారు. ఆమె కేకలు వేయడంతో చుట్టు పక్కల వాళ్లు వచ్చేసరికి దుండగులు పారిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జనవరి 1 నుంచి విజ్ఞాన్‌లో క్రికెట్ చాంపియన్‌షిప్

చేబ్రోలు: మండల పరిధిలోని వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో వచ్చే సంవత్సరం జనవరి 1 నుంచి మహోత్సవ్-2కే24లో భాగంగా జాతీయ స్థాయి క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఈ క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలకు యంగ్ ఇండియన్స్ సంస్థ ఈవెంట్ పార్టనర్‌గా వ్యవహరిస్తుందన్నారు. యూనివర్సిటీలు, ఇంజినీరింగ్ కళాశాలలు, ఫార్మసీ కళాశాలల్లో డిగ్రీ, పీజీలను అభ్యసించే విద్యార్థులందరూ ఈ పోటీలలో పాల్గొనవచ్చునని తెలియజేశారు. మ్యాచ్‌లను నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తామని తెలిపారు. విజేతలుగా నిలిచిన జట్లకు ప్రశంసా పత్రాలు, మెడల్స్‌తో పాటు విన్నర్‌కు రూ.50 వేలు, రన్నర్‌కు రూ.30 వేలు, మూడో స్థానంకు రూ.20 వేలు, నాలుగో స్థానంకు రూ.10 వేలు నగదు బహుమతులను అందజేస్తామని వెల్లడించారు. పోటీలలో పాల్గొనాలనుకునే విద్యార్థులు వెబ్‌సైట్‌లో తమ టీంలను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని వీసీ నాగభూషణ్ వివరించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ పీ.నాగభూషణ్

'చలపతి'కి ఎడ్యుస్కిల్ అవార్డులు

తాడికొండ: మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల అత్యుత్తమ పనితీరును కనబరిచినందుకు వివిధ వ్యక్తిగత- సంస్థగత అవార్డులను ఎడ్యుస్కిల్ సంస్థ నుంచి అందుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ తెలిపారు. వివిధ విభాగాలలో ఏఐసీటీఈ, ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లు, ఎడ్యుస్కిల్స్ ప్రోగ్రామ్‌లో అత్యుత్తమ పనితీరును కనబరిచినందుకు ఆలిండియా ఎడ్యుస్కిల్స్ వర్చ్యువల్ ఇంటర్న్‌షిప్ 2023 ర్యాంకింగ్స్‌లో 10వ స్థానాన్ని దక్కించుకోవడమే కాక అకడమిక్ క్రెడిట్ ఫర్ ఇంటర్న్‌షిప్ అవార్డు 2023, ఎడ్యుస్కిల్స్-ఏడబ్లుస్ అకాడమీ బెస్ట్ పెర్ఫార్మింగ్ ఇనిస్టిట్యూట్ 2023, ఏఐసీటీఈ, ఎడ్యుస్కిల్స్ అధిక సంఖ్యలో ఇంటర్న్‌షిప్ అందించిన కళాశాలగా ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ చోటు సంపాదించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అవార్డుల సాధనకు కృషి చేసిన ప్రిన్సిపల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, ఆర్ అండ్ డీ డీన్ డాక్టర్ పి.బాల మురళీకృష్ణ, వివిధ విభాగాధిపతులను చైర్మన్ వైవీ ఆంజనేయులు, కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్‌లు అభినందించారు.



ఎడ్యుస్కిల్ సంస్థ అవార్డులు అందుకుంటున్న ప్రిన్సిపల్

బులియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వెదురుపర్తి

బాపట్ల: జిల్లా బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా వెదురుపర్తి లక్ష్మణ్‌మూర్తి, బొలిశెట్టి నరసింహస్వామిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఓ హోటల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో జిల్లాలోని పర్చూరు, అద్దంకి, మేదరమెట్ల, కర్లపాలెం, చెరుకుపల్లి, రేపల్లె సంఘాల నుంచి పలువురిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

కార్యవర్గం ఇలా..

బాపట్ల జిల్లా అసోసియేషన్ కార్యవర్గం జిల్లా అధ్యక్షుడిగా వెదురుపర్తి లక్ష్మణమూర్తి, గౌరవ అధ్యక్షుడు మోదడుగు నరేష్ గుప్తా, సెక్రటరీ బొలిశెట్టి నరసింహస్వామి, ట్రెజరర్ సాధు సత్యనారాయణ, కరస్పాండెంట్‌గా దొడ్డ రామకృష్ణలు ఎన్నికయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్ మాట్లాడుతూ అసోసియేషన్‌కు రాష్ట్ర సంఘం నుంచి పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. బులియన్ ఎగ్జిబిషన్ డిసెంబర్8,9,10 తేదీలలో విజయవాడలో జరగనుందని, అందరూ పాల్గొనాలని సూచించారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న బులియన్ మర్చంట్ అసోసియేషన్ జిల్లా నాయకులు

ఫిరంగిపురంలో 31.6 మి.మీ వర్షం

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా ఫిరంగిపురం మండలంలో 31.6 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా వట్టిచెరుకూరు మండలంలో 0.6 మి.మీ వర్షం పడింది. సగటున 6.6 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి... పొన్నూరు మండలంలో 30.2 మి.మీ., తెనాలి 10.8, కాకుమాను 9.4, మేడికొండూరు 9.4, ప్రత్తిపాడు 8.8, పెదనందిపాడు 4.6, కొల్లిపర 4, చేబ్రోలు 3.2, గుంటూరు తూర్పు 1.8, తాడికొండ 1.2, మంగళగిరి 1, గుంటూరు పశ్చిమ 0.8, తుళ్ళూరు మండలంలో 0.8 మి.మీ చొప్పున వర్షం పడింది.

ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక

బాపట్ల: ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్టు ఎంపిక స్థానిక మున్సిపల్ హైస్కూలులో శుక్రవారం జరిగింది. ఎంపిక ప్రక్రియలో 40 మంది బాలికలు పోటీపడగా వీరిలో 12 మందిని ఎంపిక చేసినట్లు జిల్లా కార్యదర్శి సుబ్బరాజు తెలిపారు. ఎంపికైన జట్టు ఈనెల 29,30 తేదీల్లో కర్నూలులో జరిగే 70వ అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. జిల్లా జట్టులో జి.పూర్ణిమ, పి.వరలక్ష్మి, ఎ.దీపిక, బి.గోపి శివమై, త్రివేణి, పి.భార్గవి, ప్రేమచందన, ఎస్.వసంతా, బి.రమాదేవి, ఎం.స్వాతి, టి.అజిత, కె.మహాలక్ష్మి, కె.కావ్య, ఎం.లావణ్య, పి.యామినిలు ఉన్నారు.

డిసెంబర్ 23న భగవద్గీత కంఠస్థ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో గీతా జయంతి మహోత్సవాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 23వ తేదీన గీతామందిరంలో శ్రీమద్భగవద్గీత కంఠస్థ పఠన పోటీలు నిర్వహిస్తున్నట్టు పోటీల నిర్వాహకురాలు ఈ.అమ్మడు తెలిపారు. ఈమేరకు గీతామంది రం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోటీల కరపత్రాన్ని విడుదల చేశారు. పోటీలు 4విభాగాలుగా ఏర్పాటు చేసినట్టు తెలిపా రు. 6, 7వతరగతి విద్యార్థులకు కర్మయోగం 3వ అధ్యా యం 1 నుంచి 30 శ్లోకాలు, 8, 9 తరగతుల విద్యార్థులకు కర్మయోగం 3వ అధ్యాయం 1 నుంచి 40 శ్లోకాలు, 18 సంవత్సరాల వయస్సు లోపు వారికి, పైబడిన వారికి 18 అధ్యాయాలలోని శ్లోకాలు పోటీ ఉంటుందని వివరించారు.